వడమాల సేవ



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలోని సంకట విమోచన ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం వడమాల సేవ నిర్వహించారు. మూలవిరాట్‌కు సింధూర అలంకరణ, ఆకుపూజ అనంతరం వడమాల సేవ నిర్వహించామని అర్చకుడు తులసి రమణాచార్యులు తెలిపారు.

ఎల్‌ఓసీ పత్రం అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన ఖాజామొయినుద్దీన్ కూతురు జెబా ఫాతిమా(10) చిన్న వయస్సులోనే షుగర్ వ్యాధి రావడంతో నిమ్స్‌లో చికిత్స చేయించుకునేందుకు నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌ను ఆర్థిక సాయం అడిగారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని శాంతి సాయి జెన్‌శేఖర్ పాప పరిస్థితిని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ ఇప్పించారు. ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నవాజ్ తదితరులు ఉన్నారు.

హెచ్‌ఎండీఏ జాగా..

అక్రమార్కుల పాగా!

ఓఆర్‌ఆర్ భూమిలో యథేచ్ఛగా అద్దె వసూలు

- నిషేధిత జాబితాలో పెట్టని అధికారులు
- బ్యాంకులో తనఖా పెట్టి జ రుణం తీసుకున్న వైనం
- ఘట్‌కేసర్ ఓఆర్‌ఆర్ జెంక్షన్ వద్ద భూలీలు

ఘట్‌కేసర్: ఓఆర్‌ఆర్ కోసం హెచ్‌ఎండీఏ సేకరించిన భూమిలో ప్రైవేటు వ్యక్తులు పాగా వేశారు. ఓఆర్‌ఆర్ జంక్షన్ కోసం హెచ్‌ఎండీఏ సేకరించిన భూమికి సంబంధించిన సర్వే నంబర్లను అధికారులు నిషేధిత జాబితాలో పెట్టకపోవడంతో అన్యాక్రాంతం అవుతోంది. రూ.140 కోట్లకు పైగా విలువ చేసే సర్కారు భూమి పాత యజమానుల చేతుల్లోనే ఉండిపోయింది. అందులో క్రయవిక్రయాలు, నూతన నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. వారు యథేచ్ఛగా అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. అలాగే బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకుంటున్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో 2005లో ఓఆర్‌ఆర్ కోసం సర్వే నంబర్లు 575, 580, 581లోని భూమిని నోటిఫై చేశారు.

పరాధీనంలో హెచ్‌ఎండీఏ సేకరించిన భూమి..

సర్వేనంబర్ 575లో 3.08 ఎకరాల భూమిని 2005లో నోటిఫై చేసి పరిహారాన్ని కోర్టులో



ఓఆర్‌ఆర్ జంక్షన్ కోసం సేకరించిన భూమి

జమచేశారు. కానీ ఇందులో 2.19 ఎకరాలు హెచ్‌ఎండీఏ ఆధీనంలో ఉండగా 29 గుంటల భూమి ఓ ఫార్మాసూటికల్ కంపెనీ యాజమాన్యం చేతిలో ఉంది. సర్వే నంబర్ 580లో ఓఆర్‌ఆర్ జంక్షన్ కోసం 5.17 ఎకరాల భూమిని నోటిఫై చేశారు. 3.37 ఎకరాల భూమికి పరిహారం కోర్టులో జమచేశారు. అందులో 1.20 ఎకరాల భూమి ఘట్‌కేసర్–ఈసీఐఎల్ రోడ్డు, జాతీయ రహదారిలో వెళ్లిపోయింది. 1.37 ఎకరాల సర్కారు భూమి ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల చేతిలోనే ఉంది. సర్వే నంబర్ 581లో 20 గుంటలు నోటిఫై చేయగా ఇందులో 15 గుంటల భూమికి పరిహారం న్యాయస్థానంలో జమచేయగా, 5 గుంటల భూమి జాతీయ రహదారిలో వెళ్లింది. సర్వేనంబర్ 575లో 29 గుంటలు, 580లో 1.37 ఎకరాలు, 581లో 15 గుంటలు కలిపి మొత్తం (3.01 ఎకరాల భూమి) 14,636 చదరపు గజాల భూమిలో పాత భూయజమానులే కబ్జాలో ఉన్నారు.

తనఖాతో బ్యాంకులో రుణం..

హెచ్‌ఎండీఏ సేకరించిన భూమిని తనఖా పెట్టి నారాయణరెడ్డి రూ.4.56 కోట్లను మాసబ్‌ట్యాంకులోని ఆంధ్రాబ్యాంకులో మరికొంత రుణం తీసుకున్నాడు. అలాగే మహ్మద్ బషీర్ అహ్మద్ అనే వ్యక్తి సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో రెండుసార్లు రూ.36 లక్షలు తీసుకొని తిరిగి చెల్లించాడు. అలాగే నవీన్ ప్రకాశ్ అనే వ్యక్తి యూనియన్ బ్యాంకులో రుణం తీసుకొని తిరిగి చెల్లించాడు. అలాగే బాల్‌రెడ్డి, రాంరెడ్డి సర్వేనంబర్ 580లోని భూమిని అన్నపూర్ణ ఇండస్ట్రీస్‌కు విక్రయించారని, కొందరు జాతీయ బ్యాంకుల్లో తక్కువ రుణం ఇస్తుండటంతో ప్రైవేటు సంస్థల్లో తీసుకొని తిరిగి చెల్లించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హెచ్‌ఎండీఏ అధికారులు సేకరించిన భూమిని స్వాధీనం చేసుకోకపోవడం, నిషేధిత జాబితాలో పెట్టకపోవడంతోనే ప్రైవేటు వ్యక్తులు ఆడిందే ఆట, పాడితే పాటగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. హెచ్‌ఎండీఏ అధికారులు స్పందించి సర్కారు భూమిని తమ ఆధీనంలోకి తీసుకొని అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఓఆర్‌ఆర్ జంక్షన్ కోసం సేకరించిన భూమి సర్వే నంబర్లు తెలిపే మ్యాప్

చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి



హెచ్‌ఎండీఏ భూమిని స్వాధీనం చేసుకోకుండా నిర్లక్ష్యం చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. భూమికి పరిహారం చెల్లించగానే నిషేధిత జాబితాలో పెడితే సరిపోయేది. అలా చేయకపోవడంతో బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లయ్యింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

– వేముల మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ బీ బ్లాక్ అధ్యక్షుడు

హెచ్‌ఎండీఏ అధికారుల తప్పిదం..

2005 నోటిఫై అనుసరించి హెచ్‌ఎండీఏ సేకరించిన భూమిలో 3.01 ఎకరాల భూమి యజమానుల చేతిలోకి వెళ్లిపోయింది. అందులో 2018 నుంచి క్రయవిక్రయాలు జరిగి బ్యాంకు రుణం తీసుకున్నారు. నోటిఫై చేసిన భూమిని నిషేధిత జాబితాలో చేర్చాలని భూసేకరణ స్పెషల్ కలెక్టర్ సూచించారు. ఓఆర్‌ఆర్ కోసం సేకరించిన భూమిని రెవెన్యూ రికార్డుల్లో అప్‌డేట్ చేయాలని తిరిగి 2017లో ప్రొసీడింగ్స్ జారీ చేశారు. 2018లో హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ రిఫర్ చేస్తూ మళ్లీ కలెక్టర్‌కు లేఖ పంపారు. ఓఆర్‌ఆర్ కోసం హెచ్‌ఎండీఏ సేకరించిన భూమిని గత ఐటీ శాఖ మంత్రి ఆదేశం మేరకు ఆయన స్నేహితుడికి మేలు చేయాలని సర్వీస్ రోడ్డు నిర్మించకుండా వదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాయిదత్త పీఠాధిపతికి రామమందిర ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందుకున్న శ్రీరామానంద ప్రభు

కీసర: అయోధ్య శ్రీభవ్య రామమందిర ప్రారంభోత్సవంలో పాల్గొనాలని శ్రీసాయిదత్త పీఠాధిపతి స్వామి శ్రీరామానంద ప్రభును మంగళవారం ఆహ్వానించారు. శ్రీరమాసత్యనారాయణ స్వామి, శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంగారావు, వాడపల్లి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీగోదాదేవి కల్యాణం



స్వామి వారి సేవలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ఎదులాబాద్‌లో శ్రీగోదాదేవి రంగ నాయక స్వామి కల్యాణ మహోత్సవం

ఘట్‌కేసర్: ఏదులాబాద్ శ్రీగోదా సమేత శ్రీమాన్నారు రంగనాయక స్వామి ఆలయం ఆవరణలో సోమవారం శ్రీగోదాదేవి రంగనాయకస్వామి అమ్మవారి వారి కల్యాణం ఘనంగా జరిగింది. వివాహ వేదికలను పూలతో అందంగా అలంకరించి శ్రీగోదాదేవి, రంగనాయక స్వామిని వివాహానికి ముస్తాబు చేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కల్పనారెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వివాహం అనంతరం అక్షింతలు పంపిణీ చేసి పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ సురేశ్, తులసి దంపతులు, ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, గోవిందాచార్యులు, పురుషోత్తం ఆచార్యులు, సేనాచార్యులు, రఘుమాచార్యులు, పరప్రసాదాచార్యులు, భక్తులు లక్ష్మణ్, రవి, మంకయ్య, కొండల్‌రెడ్డి, చిరంజీవిముదిరాజ్, శేఖర్ పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు

గౌతంనగర్: గౌతంనగర్‌కు చెందిన శ్రీసాయి క్యాటరింగ్ నిర్వాహకులు యల్లంరాజు శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం గౌతంనగర్ నుంచి శబరిమలకు తరలివెళ్లారు. 121 రోజులుగా అయ్యప్ప దీక్షలో ఉండి ప్రతిరోజూ అయ్యప్ప స్వాములకు మండల పూజల్లో నిత్యం అన్నదానం చేశామని ఆయన తెలిపారు. శ్రవణ్‌గురుస్వామి, మణికంఠ గురుస్వామి, నవీన్‌గురుస్వామి, గణేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు. ఈస్ట్ ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన కుమ్మరి రాజు గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఇరుముళ్లతో శమరిమలకు తరలివెళ్లారు.

ఘనంగా క్షేత్రగిరి జాతర



క్షేత్రగిరి ఆలయం వద్ద భక్తుల సందడి



పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ మరుసటి రోజు నిర్వహించే క్షేత్రగిరి జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని రాజబొల్లారం పరిధిలోని మేడ్చల్–శామీర్‌పేట్ మండలాల సరిహద్దులోని క్షేత్రగిరి ఆలయంలో ధనుర్మాసంలో పూజలు ప్రారంభించి గోదాదేవి కల్యాణం చేసి సంక్రాంతి పండగ వరకు ఉత్సవాలు చేసి పండగ మరుసటి రోజు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రెండు మండలాల ప్రజలు, పరిసర మండలాలు, జిల్లాల ప్రజలు వేల సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. కొండపై భోజనాలు వండుకుని అక్కడే వన భోజనాలు చేసి గాలిపటాలు ఎగురవేసి పండగతో పాటు జాతరను ఘనంగా జరుపుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. కొండపైకి వాహనాలను అనుమతించకుండా కిందే నిలిపేశారు. మేడ్చల్ కౌన్సిలర్ మణికంఠగౌడ్ నేతృత్వంలో అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు, దేవాదాయశాఖ అధికారులు క్యూలైన్లను ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించారు.

స్వామివారి సేవలో ఎమ్మెల్యే మల్లారెడ్డి..

జాతర సందర్భంగా క్షేత్రగిరిలో వేంకటేశ్వర స్వామిని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని దేవుడి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రేపు కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: విద్యుత్ మరమ్మతుల కారణంగా చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గురువారం పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ పృథ్వీరాజ్ తెలిపారు. సాయినగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని రెడ్డికాలనీ, సుభాష్‌నగర్, కృష్ణారెడ్డినగర్, సాయినగర్, నాగార్జుననగర్ కాలనీ రోడ్ నంబర్లు 2, 3, 4, 5, 6, చక్రీపురం, ఇందిరానగర్ కాలనీలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడ్చల్‌రూరల్: జాతీయ రహదారిపై పండగ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన సైదులు సంక్రాంతి పండగ రోజు కావడంతో మటన్ తినడానికి మెదక్ జిల్లా కాళ్లకల్‌కు వెళ్లాడు. అక్కడ మటన్ కొనుగోలు చేసుకుని ఇంటికి వచ్చేందుకు ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారిపై వస్తుండగా సంగం హెల్త్‌కేర్ కంపెనీ వద్ద వెనుక నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో సైదులు రోడ్డుపై ఎగిరిపడ్డాడు. దీంతో బలమైన గాయాలై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సైదులు వృత్తిరిత్యా లారీ డ్రైవర్. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలి

మల్లాపూర్: నాచారం కూరగాయల మార్కెట్ యార్డులో చెత్తాచెదారం వేస్తున్నందుకు నిరసనగా కాంగ్రెస్ నేతలు బాలు యాదవ్, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో నిత్య వందల మంది మార్కెట్‌కి వచ్చేవారు చెత్త వాసన భరించలేకపోతున్నారన్నారు. కొంత మందిని చెత్తను మార్కెట్‌లో వేసి వెళ్తున్నారని, ఒక జీహెచ్ఎంసీ సిబ్బందిని నియమించి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో కూడా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవియాదవ్, వెంకట్‌రెడ్డి, మూర్తి, బాలరాజ్, బాలు తదితరులున్నారు.

పేదల కోసం 140 పథకాలు



మాట్లాడుతున్న ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి

కీసర: పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 140 పథకాలను అమలు చేస్తోందని ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోగారంలో సర్పంచ్ కవిత అధ్యక్షతన నిర్వహించిన వికసిత్ భారత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులు, ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ వంటి పథకాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. సమావేశంలో భోగారం బీజేపీ నాయకులు అబ్రబోయిన నాగరాజు ముదిరాజ్, సభ్యులు గోసుల శ్రీనివాస్, బీజేపీ కార్యకర్త రాయబంటి నాగరాజుచారి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంబురాలు

సందడిగా మినీ శిల్పారామం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కనుము వేడుకలను స్థానికులు ఇక్కడే చేసుకోవడం విశేషం. సంక్రాంతి చివరి రోజైన కనుమ పండుగ రోజు గంగిరెద్దుల విన్యాసాలు, జంగమదేవరులు, బుడబుక్కల వేషాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంప్రదాయం, పల్లె అందాలు ఉట్టి పడే విధంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ప్రేరిణి శ్రీనివాస రావు శిష్య బృందం ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శన వావ్ అనిపించింది.

సిబ్బందే కాదు.. మందులకూ కొరతే..

- పశువుల ఆస్పత్రుల్లో అరకొర వసతులు
- 43 లక్షల పశుసంపద.. 29 గ్రామీణ పశువైద్యశాలలు
- ఇబ్బందుల్లో మూగ జీవుల పెంపకందారులు
- ఏడేళ్లు కావస్తున్నా.. జిల్లా పశువైద్యశాలకు దిక్కేలేదు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మూగజీవాలకు సరైన వైద్యం అందడం లేదు. ప్రభుత్వ పశువైద్యశాలలో ఒకవైపు మందుల కొరత, మరోవైపు సరిపడా సిబ్బంది లేక మూగజీవాల పెంపకం దారులకు ప్రైవేటు పశుదుకాణాలే దిక్కయ్యాయి. నిర్వహణ ఖర్చు పెరగడంతో పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పశుసంపద మొత్తం 43,00,886 కాగా, ఇందులో గోజాతి పశువులు 27,068, గేదెజాతి పశువులు 59,895, గొర్రెలు 1,49,401, మేకలు 40 వేలు, పందులు, 2,485, కోళ్లు, 39,72,037, కుక్కలు 50 వేలు ఉన్నాయి. జిల్లాలో పశు ఆస్పత్రులు మాత్రం రెండు ఏరియా, 16 పట్టణ, 29 గ్రామీణ పశువైద్య ఆస్పత్రులు ఉన్నాయి. పశు వైద్యశాలలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి మందుల కోసం ప్రభుత్వం రూ.7 లక్షల చొప్పున అందజేస్తోంది. ఏడాదిలో నాలుగు విడతలకు రూ.28 లక్షలు మందులకు అందజేస్తోంది. నిర్దేశించిన విధంగా పశువైద్యశాలలకు విడతల వారిగా మందులకు నిధులు విడుదల చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పాడి రైతులు పశు వైద్యశాలలకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

వసతులు అంతంతే..

ఇరుకైన గదులు, శిథిలావస్థకు చేరిన వైద్య కేంద్రాల్లో సరైన వసతులు లేక పరిస్థితి అధ్వానంగా ఉంది. కనీసం తాగునీటి సదుపాయం, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఉద్యోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. కూకట్‌పల్లి, గౌడవెల్లి ప్రాథమిక పశువైద్యశాలల భవనాలు శిథిలావస్థలో ఉండటంతో.. వేరే చోట నడిపిస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఏర్పడి ఏడు సంవత్సరాలు కావొస్తున్నా.. జిల్లాస్థాయి పశు వైద్యశాలకు దిక్కు లేదు. ప్రస్తుతం ఉన్న పశువైద్యశాలలో సిబ్బంది కొరత వేధిస్తోంది. మేడ్చల్, ఉప్పల్ ఏరియా ఆస్పత్రులతో పాటు ఘట్‌కేసర్, పోచారం, డబుల్పూర్, పూడూరు, ఎంసీపల్లి, ఉద్దమర్రి, శామీర్‌పేట్, యాంజల్, దుండిగల్, అల్వాల్, కుత్బుల్లాపూర్, బాలానగర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి ప్రాంతాల్లోని ప్రాథమిక పశు వైద్యశాలల్లో డాక్టర్‌తో సహా ఇద్దరి సిబ్బంది చొప్పున.. ఉండాల్సి ఉండగా, చాలాచోట్ల ఖాళీలు ఉన్నాయి. జిల్లా ఆస్పత్రుల్లో ఇద్దరు డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, అటెండర్ పోస్టులతో సహా పలు ఖాళీలు ఉన్నాయి. దీంతో పశువులకు అరకొర వైద్యసేవలు మాత్రమే అందుతున్నాయి. నగరానికి సమీపంలో పశువైద్యశాలలు ఉన్నా.. డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంతో పశువులకు వైద్య సేవలు సరిగ్గా అందడం లేదని తెలుస్తోంది. ఒకరిద్దరు సిబ్బందితోనే పశు వైద్యశాలలను నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షణ కొరవడటంతో రోజుల తరబడి పలు పశువైద్యశాలలకు డాక్టర్లు, సిబ్బంది రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

అదృశ్యమైన బాలుడు శవమై లభ్యం



మృతి చెందిన బాలుడు ప్రిన్స్

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో పుకట్‌నగర్‌లో సోమవారం కనిపించకుండా పోయిన ఎనిమిదేళ్ల బాలుడు మంగళవారం శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన ప్రదీప్ రునా జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి చర్లపల్లిలో నివాసం ఉంటున్నాడు. తన కొడుకును సమీపంలోని ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించాడు. 3వ తరగతి చదువుతున్న ప్రిన్స్ సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని కనకదుర్గ వైన్‌షాపు ఎదురుగా ఉన్న చెట్ల పొదల్లో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు గోడ పైనుంచి కిందపడి మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాలుడి మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

బఫర్.. బేఫికర్..

- యథేచ్ఛగా కొనసాగుతున్న నిర్మాణాలు
- పట్టించుకోకుండా అధికారుల నిర్లక్ష్యం
- నోటీసులతోనే సరిపెడుతున్న వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు
- ఇప్పటికైనా స్పందించాలని వేడుకోలు

ఉప్పల్: నిత్యం వాహనాల రద్దీతో ఉండే రోడ్డు, పక్కనే నాలా బఫర్ జోన్.. అందులోనే అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. సెలవులు వస్తే చాలు అక్రమార్కులు చకచకా నిర్మాణాలు చేస్తూ ఒకటి, రెండు రోజుల్లోనే తమపని పూర్తి చేసుకుంటున్నారు. ఫిర్యాదులు వచ్చే సరికి నోటీసులు అందజేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో నిత్యం ఈ తంతు కొనసాగుతోంది. ఉప్పల్ దేవేందర్‌నగర్ వెళ్లే దారిలో నాలా పక్కనే ఉన్న బఫర్ జోన్ స్థలంలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. వరుస సెలవులు రావడంతో అక్రమార్కులు తిష్టవేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక పక్క నాలా.. మరోపక్క రోడ్డు ఉన్నా యథేచ్ఛగా కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంపై దేవేందర్‌నగర్ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



నాగోల్ మెట్రో స్టేషన్-దేవేందర్‌నగర్ రోడ్డు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు

ఘనంగా సంక్రాంతి సంబరాలు



సంస్కృతి టౌన్‌షిప్‌లో కైట్ ఫెస్టివల్‌లో కౌన్సిలర్ హరిప్రసాదరావు



ముగ్గులు వేస్తున్న మండల వ్యవసాయాధికారి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో సంక్రాంతి పండగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సంస్కృతి టౌన్‌షిప్‌లో కౌన్సిలర్ బి.హరి ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కైట్ ఫెస్టివల్ కాలనీవాసుల్లో జోష్ నింపింది. పురప్రజలు సంప్రదాయ దుస్తులు ధరించి సమీపంలోని పార్కుల్లో సెల్ఫీలు తీసుకుంటూ సంతోషంగా సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్నారు.

పతంగులు ఎగురవేస్తూ..

శామీర్‌పేట్: సంక్రాంతి పండగను సోమవారం ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల వాకిళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు.

అందమైన ముగ్గులు వేసి..

ఘట్‌కేసర్: సంక్రాంతి సంబురాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. యువకులు గాలి పటాలను ఎగిరేశారు.



ఘట్‌కేసర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



శామీర్‌పేట్‌లో ముగ్గులు వేస్తున్న యువతి